క్లుప్తంగా

నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు



సోమగూడెంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం, చొప్పరిపల్లి, కాసిపేట, కోమటిచేను గ్రామాల్లో సోమవారం కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు గంజాయి కేసుల్లో ఉన్న పాత నేరస్తులు, గంజాయి సేవించే వారిని లక్ష్యంగా చేసుకొని నార్కోటిక్ డాగ్‌తో వారి ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో, గంజాయి సేవించే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి క్షుణ్ణంగా తనిఖీలు చేసినట్లు ఎస్సై తెలిపారు. గతంలో కేసులు ఉన్నవారిని గుర్తించి వారితో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్నామన్నారు.

కాలువలపై అక్రమ నిర్మాణాల తొలగింపు



జేసీబీ ద్వారా తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని మార్కెట్ ఏరియాలోని దుకాణాల సముదాయాల వెనుక భాగంగా మున్సిపల్ కాలువపై అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను సోమవారం మున్సిపల్ సిబ్బంది జేసీబీ, ట్రాక్టర్ వాహనాలతో తొలగించే చర్యలు ప్రారంభించారు. కొంతమంది వ్యాపారులు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ పట్టించుకోలేదు. కొంతమంది వ్యాపారులు రెండు రోజులు అవకాశం ఇస్తే, నష్టం కలుగకుండా తొలగించుకుంటామని అభ్యర్థించడంతో సిబ్బంది అవకాశం కల్పిస్తూ మరో రెండు రోజుల వరకు తొలగింపు చర్యలను వాయిదా వేసుకున్నారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని, నిర్మాణాలు చేపట్టిన వారు తొలగించుకుంటే బాగుంటుదని మున్సిపల్ సిబ్బంది పేర్కొన్నారు.

అంధుల సంస్థకు విరాళం

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్ అంధులతో నడుపుతున్న స్వచ్ఛంద సంస్థ ఇన్స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్, రిలీఫ్ రీహాబిలిటేషన్ ఆఫ్ డిసేబుల్, డిస్ట్రెస్డ్ అండ్ డిసింహీరోటెడ్ చిల్డ్రన్ సంస్థకు మంచిర్యాల రివిలేషన్ విద్యార్థులు, ఉపాధ్యాయులు విరాళం అందజేశారు. పాఠశాల విద్యార్థులు సేకరించిన విరాళాలతో పాటు రూ.ఉపాధ్యాయుల ఒక రోజు వేతనం జమ చేసి రూ.81,000 చెక్ రూపంలో సోమవారం కరస్పాండెంట్ విష్ణువర్ధన్‌రావు సంస్థకు అందజేశారు.

మహాధర్నా విజయవంతం చేయండి

చెన్నూర్: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు అన్నారు. మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక ఎంజేపీ, సాంఘిక సంక్షేమ గురుకుల, మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్లు, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25న కూరగాయల మార్కెట్ ప్రారంభం

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో కొత్తగా నిర్మించిన కూరగాయల మార్కెట్ సముదాయాన్ని ఈ నెల 25న ప్రారంభం చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ కూరగాయల మార్కెట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. మార్కెట్‌సముదాయంలో 108స్టాల్స్ ఉన్నాయని, వీటిని 108మంది వ్యాపారులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. వ్యాపారులు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, ప్రస్తుతం 65మంది వ్యాపారులు డిపాజిట్ కట్టారని తెలిపారు. మిగితా వ్యాపారులు 24వ తేదీ మధ్యాహ్నం 12గంటల వరకు చెల్లించాలని, లేకపోతే కొత్తవారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవం చేశాక, బయట ఎవరూ అమ్మకాలు సాగించవద్దని, నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలిగా జ్యోతి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగ్ అధ్యక్షురాలి గా మంచిర్యాలకు చెందిన నాగిశెట్టి జ్యోతి, ప్రధాన కా ర్యదర్శిగా నరేంద్రు ల సాహితీలను ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ముక్త శ్రీనివాస్ ఎన్నుకున్నారు.

ఫిర్యాదు చేసినా.. పట్టించుకోరా..!



వేమనపల్లి: తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

- ఆక్రమణలపై మూడు సార్లు ఫిర్యాదు
- అయినా పట్టించుకోవడం లేదని ఆరోపణ
- పలుచోట్ల ప్రజావాణికి స్పందన అంతంతే..

వేమనపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఆక్రమణలపై ప్రభుత్వం కొరఢా ఝులిపిస్తున్నా, వేమనపల్లి మండలంలో మాత్రం అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దస్నాపూర్ శివారులోని పెద్ద చెరువు శిఖం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మైదాన స్థలం కబ్జాకు గురైంది. ఈ విషయమై ప్రజావాణిలో రెండుసార్లు, జిల్లా కలెక్టర్‌కు ఒకసారి దస్నాపూర్ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో సోమవారం గ్రామస్తులు మళ్లీ తహసీల్దార్ రమేష్‌కు ఫిర్యాదు చేసి అక్రమార్కుల చెర నుంచి కబ్జాకు గురైన స్థలాన్ని కాపాడాలని కోరారు. దస్నాపూర్ శివారులోని సర్వే నం.40లో 30ఎకరాల 18గుంటల విస్తీర్ణంలో చెరువు ఉంది. ఈ చెరువు 70శాతం కబ్జాకు గురి కాగా, కేవలం 7ఎకరాల విస్తీర్ణంలో శిఖం భూమి మాత్రమే ఉన్నట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. ఈ చెరువులో అధికార, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పాగా వేసారని ఆరోపిస్తున్నారు. ఏదిఏమైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని, ఆక్రమణకు గురైన చెరువుతో పాటు పాఠశాల భూమిని స్వాధీనం చేసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించండి

కాసిపేట: మండలంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో బీజేపీ మండలాధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్ వినతిపత్రం సమర్పించారు. కొండపూర్‌యాప నుంచి సోనాపూర్ వరకు ప్రధాన రోడ్డుపక్కన పిచ్చిమొక్కలు పెరగడంతో ప్రమాదాలకు కారణం అవుతున్నాయని, వెంటనే తొలగించాలని కోరారు. చిన్నధర్మారం గ్రామంలో తాగునీటి సమస్య, బ్రిడ్జి మరమ్మతు, బ్రిడ్జి పై సైడ్ వాల్ నిర్మాణం చేపట్టాలని, రొట్టెపల్లి గ్రామపంచాయతీలో రోడ్డు, నీటిసమస్య తీవ్రంగా ఉందని వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పెద్దపల్లి శంకర్ తదితరులున్నారు.

చెరువుల హద్దుల వివరాలివ్వాలి



వినతిపత్రం ఇస్తున్న కమిటీ నాయకులు

జన్నారం: మండలంలోని చెరువుల విస్తీర్ణం, హద్దుల వివరాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో ప్రభుత్వ భూముల చెరువుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ కమ్మల విజయధర్మా, నాయకులు భూమాచారి, దాసరి తిరుపతి, మహేష్, సత్తన్న, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- మిషన్ భగీరథపై చర్చ
- మూడేళ్లైనా నీళ్లివ్వరా అంటూ అధికారులపై కౌన్సిలర్ల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

చెన్నూర్: మున్సిపాలిటీలో మిషన్ భగీరథ ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా ప్రజలకు మంచినీళ్లు ఇవ్వరా అని మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనా రాంలాల్ గిల్డా అధ్యక్షతన సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలపై కౌన్సిల్ సభ్యులు అధికారులను నిలదీశారు. గత మున్సిపల్ సమావేశంలో నెల రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని నివాస గృహాలకు నీరందిస్తామని అధికారులు చెప్పినప్పటికీ, నేటికీ నీరు సరఫరా కావడం లేదని కౌన్సిలర్ కమ్మల శ్రీనివాస్, గర్రెపల్లి శాంతరాణిలు ఏఈ సరితను ప్రశ్నించగా, ఆమె ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. మున్సిపాలిటీలో తడి, పొడి చెత్త సేకరణ కోసం 16 స్వచ్ఛ ఆటోలు కొనుగోలు చేసినట్లు, కానీ మున్సిపాలిటీలో కేవలం 5ఆటోలే నడుస్తున్నాయని మిగితా ఆటోలు ఏమయ్యాయని ఇన్‌చార్జి కమిషనర్ ఏఈ సాయికిరణ్‌ను కౌన్సిలర్ జాడి సురేఖ ప్రశ్నించారు. 11 స్వచ్ఛ ఆటోలు రిపేరులో ఉన్నాయని, త్వరలోనే తీసుకొస్తామని తెలిపారు. వార్డుల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదని, ప్రజలు విష జ్వరాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారని, పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. మున్సిపాలిటీ ఆదాయానికి మించి ఉద్యోగులు ఉన్నారని, గతంలో తొలగించిన ఆపరేటర్‌ను తిరిగి తీసుకుంటామని తీర్మానం చేయగా కౌన్సిల్ సభ్యులు తిరస్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగుపర్చాలి



శిక్షణ ఇస్తున్న ఎంఈవో ప్రభాకర్

తాండూర్: విద్యార్థుల్లో సామర్థ్యాలను మెరుగుపర్చేలా బోధన సాగించాలని తాండూర్ ఎంఈవో ప్రభాకర్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎఫ్ఎల్ఎన్ పై తెలుగు బోధించే ఉపాధ్యాయులకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, మండల నోడల్ అధికారి మల్లేశం, తాండూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లు హరిప్రసాద్, విద్యాసాగర్, వేణుగోపాల్ రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న మల్టీపర్పస్ వర్కర్స్ మిషన్ భగీరథ, గ్రామీణ నీటి పారుదల వ్యవస్థ పై అవగాహన కలిగి ఉండి మరమ్మతు పనుల కోసం శిక్షణ పొందాలని మిషన్ భగీరథ మంచిర్యాల జిల్లా ఎస్.ఈ రవీందర్ అన్నారు. బెల్లంపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మిషన్ భగీరథ ఇంట్రా విభాగం గ్రామ మంచినీరు సరఫరా సహాయకుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ నుంచి ఒక్కో మల్టీపర్పస్ వర్కర్‌కు చేతి పంపుల మరమ్మతు, గ్రామంలో ఏ తీరుగా నీటి సరఫరా పైప్ లైన్ అమర్చి ఉందో వివరించారు. చేతి పంపుల మరమ్మతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.మహేందర్, ఎంపీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈ.ఈ వెంకటేష్, ఏ.ఈ శ్రీనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు అవగాహన

కాసిపేట/లక్సెట్టిపేట/జైపూర్: మిషన్ భగీరథ ఇంట్రా విభాగం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లకు మిషన్ భగీరథ, చేతి పంపు మరమ్మతులపై అవగాహన కల్పించారు. కాసిపేటలో తాగునీటి సహాయకులు ఆర్‌డబ్ల్యూఎస్ మహ్మద్ జాఫర్, లక్సెట్టిపేటలో ఎంపీడీవో సరోజ, మిషన్ భగీరథ జేఈ నరేశ్ గ్రామాలకు వచ్చే నీటి సరఫరా పైప్‌లైన్ ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. నాలుగు రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమాల్లో కాసిపేటలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ డెప్యూటీ ఈఈ రతన్‌కుమార్, ఏఈఈ అచ్యుత్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, లక్సెట్టిపేటలో హాజీపూర్ ఎంపీడీవో గిరిజ, లక్సెట్టిపేట ఎంపీవో శ్రీనివాస్, జైపూర్‌లో ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ విద్యాసాగర్ రావు, ఎంపీవో శ్రీపతిబాబురావు, మిషన్ భగీరథ సూపర్‌వైజర్లు, ఎంపీడబ్ల్యూ వర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

30న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న హైదరాబాద్ వేదికగా సచివాలయం ముందు నిరసన తెలుపనున్నట్లు దళిత బహుజన పార్టీ (డీబీపీ) జిల్లా ఇన్‌చార్జి లింగాల జలపతి తెలిపారు. కాంటా చౌరస్తాలో కరపత్రాలు ఆవిష్కరించారు.

బతుకమ్మ కానుకగా చీరలు పంపిణీ

నస్పూర్: పట్టణ పరిధిలోని రాయల్ గార్డెన్ వద్ద కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ కానుకగా చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొని ఆడపడుచులకు చీరలు పంపిణీ చేశారు.

వినతిపత్రం అందజేత

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని తీగలకుంటకు నీటి సరఫరా అందించే కాలువ కబ్జాకు గురైందని మున్సిపాలిటీ పరిధిలోని రజకులు సోమవారం స్థానిక ఇరిగేషన్ జేఈ రాజేందర్‌కు వినతి పత్రం అందించారు. కాలువ ప్రదేశాన్ని పరిశీలించి, తదుపరి చర్యలు చేపడుతామని జేఈ తెలిపారు.

డివిజన్ స్థాయి క్రీడా పోటీలు

లక్సెట్టిపేట: ఈ నెల 24వ తేదీన మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల డివిజన్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి గంగారాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 విభాగంలో క్రీడా పోటీలను స్థానిక మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల బాలుర పాఠశాలలోని మైదానంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బెల్ట్ షాపుల దందాపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని చాలా గ్రామాల్లో, మారుమూల పల్లెలో బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతుందని, వాటిపై చర్యలు తీసుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.

'కమిటీని రద్దు చేసే అర్హత ఎవరికీ లేదు'

బెల్లంపల్లి: తమసంఘం పాత కమిటీని రద్దు చేసినట్లు కొందరు చేసిన ప్రకటన సరికాదని, తమదే నిజమైన సంఘమని బెల్లంపల్లి దళిత కులాల పరిరక్షణ సంఘం నాయకులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడారు.

108లో ప్రసవం

కాసిపేట: తాండూర్ మండలం అన్నారంకు చెందిన సునార్కర్ సౌందర్య ఆదివారం రాత్రి 108అంబులెన్స్‌లో ప్రసవించి పాపకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది కథనం ప్రకారం.. గర్భిణికి కీళ్ల నొప్పులు, బీపీ అధికంగా ఉండటంతో మంచిర్యాల ఆస్పత్రికి రెఫర్ చేశారు. 108లో వెళ్లే క్రమంలో మంచిర్యాల సమీపంలో నొప్పులు తీవ్రమై ఆస్పత్రి ముందు గేటు వద్ద రాత్రి 11గంటలకు అంబులెన్స్‌లో డెలివరీ కాగా పాపకు జన్మనిచ్చింది. ఈఎంటీ ఆత్మారావు, పైలెట్ అసద్‌పాషా తదితరులున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి మరమ్మతు చేయించాలి

తాండూర్: మండలంలోని తాండూర్ రైల్వే అండర్ బ్రిడ్జి మరమ్మతు చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బెల్లంపల్లి రైల్వే జీఎం గోపికి సోమవారం వినతిపత్రం అందజేశారు.

పత్తి పంట పరిశీలన

కాసిపేట: పత్తిపంట కాయ దశలో ఉందని, ప్రస్తుతం పత్తిపంటలో రసం పీల్చే పురుగులు పచ్చదోమ, తెల్లదోమ, పిండినల్లి, ఆకు మచ్చ తెగులు, సూక్ష్మ దాతు పోషకాల లోపాలు ఉన్నాయని వీటిని నివారించుకోవాల్సిందిగా ఏఈవో చల్ల ప్రభాకర్ తెలిపారు. మండలంలోని కోమటిచేనులో సోమవారం పత్తిపంటలను పరిశీలించారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై ఆసక్తి

భీమారం: గ్రామాల్లో బీజేపీ చేపట్టిన సభ్యత్వ నమోదుపై ప్రజలు ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారని జిల్లా బీజేపీ నాయకులు మాడెం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని మద్దికల్, అంకూపాపూర్, కొత్తపల్లిలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

కలప పట్టివేత

జన్నారం: జన్నారం అటవీ రేంజ్ పరిధిలోని శ్రీలంక కాలనీలో తీగల నరేశ్ ఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన టేకుదుంగలను పట్టుకున్నట్లు డీఆర్వో తిరుపతి సోమవారం తెలిపారు. కలప విలువ రూ.14వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు డీఆర్వో తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాసిపేట: మండల యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగిలి రమేశ్(34)చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గత మంగళవారం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరాడు. చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. అయితే విషపురుగు కుట్టినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విషపురుగు కుట్టడం వల్ల చనిపోయాడా, లేక అనారోగ్య కారణాలతో మృతిచెందాడా అని మృతుడు తల్లి లక్ష్మి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

ఇందారంలో ఇసుక సీజ్

జైపూర్: మండలంలోని ఇందారంలో ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమంగా నిల్వచేసిన 110ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక కుప్పలను రెవెన్యూ అధికారులు తహసీల్దార్ వనజారెడ్డి, ఆర్ఐ తిరుపతి సీజ్ చేశారు.

బొగ్గుబాయి వార్తలు

'ఏరియర్స్ ఇప్పించాం'

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఎస్అండ్‌పీసీ డిపార్టుమెంట్‌లో పనిచేసే కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డుల ఏరియర్స్ డబ్బులు ఇప్పించామని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(సీఐటీయూ) బ్రాంచీ కార్యదర్శి గట్టు మహేందర్ తెలిపారు. ఆ డిపార్టుమెంట్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన సెక్యూరిటీ గార్డులతో మాట్లాడారు. 138 మందికి ఈ నెల 20న వారి బ్యాంక్ ఖాతాలో ఏరియర్స్ డబ్బులు జమ చేసినట్లు తెలిపారు.

సంతకాల సేకరణ

శ్రీరాంపూర్: తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఎస్సార్పీ 3, 3ఏ గనిపై సోమవారం ఆ పార్టీ నాయకులు కార్మికులను కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, పట్టణ కార్యదర్శి మిడివెల్లి రాజు, నాయకులు ప్రేమ్ కుమార్, పాయిరాల రాము తదితరులు పాల్గొన్నారు.

రెస్ట్‌హోల్ ప్రారంభం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం నిర్మించిన రెస్ట్ హాల్‌ను సోమవారం పీవో శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి ఓసీపీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీ, సంక్షేమ అధికారి శంకర్, ఫిట్ సెక్రెటరీ లచ్చన్న, నాయకులు బద్రి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌పార్క్‌లో స్వచ్ఛతా పక్వాడా

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి గ్రీన్‌పార్క్‌లో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఏరియా జీఎం దేవేందర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏరియా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సీఎంపీఎఫ్ చీటీలు పంపిణీ చేయాలి

తాండూర్: సింగరేణి కార్మికులకు సీఎంపీఎఫ్ లెక్కల వివరాలతో కూడిన చీటీలను వెంటనే పంపిణీ చేయాలని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికులకు సీఎంపీఎఫ్ లెక్కలు తెలియజేయాలని పేర్కొన్నారు.

ఏరియాలో బాస్కెట్‌బాల్ పోటీలు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో సోమవారం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో ఏరియా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను కేకే డిస్పెన్సరీ వైద్యుడు నాగేశ్వరరావు ప్రారంభించారు. హోరాహోరీగా కొనసాగిన ఈ పోటీల్లో కాసిపేట గ్రూపు జట్టు విన్నర్, కేకే-గ్రూపు జట్టు రన్నర్‌గా నిలిచింది.

పోషకాహారంపై అవగాహన

భీమిని: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యుడు కుమారస్వామి పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఇద్దరిని పిల్లల వైద్యనిపుణులు బెల్లంపల్లికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కుమారస్వామి, ఎస్సై విజయ్, సీహెచ్‌వో జలపతి, ఏఎన్‌ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి లోక్ అదాలత్

వేమనపల్లి: నీల్వాయి పోలీస్‌స్టేషన్లో ఎస్సై శ్యాం పటేల్ సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. నేటి నుంచి 28వ తేదీ వరకు బెల్లంపల్లి కోర్టులో లోక్ అదాలత్ కార్యక్రమం ఉంటుందని, కేసులు ఉన్నవారు రాజీ కోసం లోక్ అదాలత్‌కు హాజరు కావాలని కోరారు. దీని కోసం ఫిర్యాదుదారుడు, నేరస్తులు తమ ఆధార్‌కార్డు తీసుకొని బెల్లంపల్లి కోర్టు, నీల్వాయి పోలీస్‌స్టేషన్‌కు రావాలని కోరారు.

గైర్హాజరు లేకుండా పని చేయాలి

- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి



నియామకపత్రాలు అందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: యువ ఉద్యోగులు గైర్హాజరు లేకుండా సక్రమంగా డ్యూటీలు చేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఏరియాలో కారుణ్య ఉద్యోగాలు పొందిన 35మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవింద రావు, డెప్యూటీ పీఎం రాజేశ్వర్, సీనియర్ పీఓ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ లాభాల్లో వాటా ఇవ్వాలి

- గనులపై టీబీజీకేఎస్ నిరసన



కేకే-5 గనిపై నల్ల బ్యాడ్జీలతో నిరసన

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్/తాండూర్: సింగరేణి గడిచిన ఆర్థిక సంవత్సరం సాధించిన వాస్తవ లాభాల నుంచి కార్మికులకు 33శాతం వాటాను చెల్లించాలని టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. సింగరేణి సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరంలో అర్జించిన లాభాల వాటా చెల్లింపుల విషయంలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీరాంపూర్‌లో ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, గొర్ల సంతోష్, ముత్యాల రమేష్, తాండూర్‌లో టీబీజీకెఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు మంగీలాల్, టీబీజీకేఎస్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేశ్, ఫిట్ కార్యదర్శి గణపతి, నాయకులు, కార్మికులు ఉన్నారు.


లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



తాండూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తూ...

తాండూర్/బెల్లంపల్లి/పాతమంచిర్యాల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేసి కార్మికుల హక్కులను కాపాడాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు ఇచ్చిన బ్లాక్ డే పిలుపుతో సోమవారం జిల్లా కేంద్రంలో సింగరేణి కార్మిక సంఘం, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో, తాండూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో, బెల్లంపల్లిలో సింగరేణి ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. లేబర్ కోడ్‌లను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో, బెల్లంపల్లిలో లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. తాండూర్‌లో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా కేంద్రంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జైపాల్‌సింగ్, నాయకులు బింగి సుధాకర్, జాడి చంద్రయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు శ్రీనివాస్, అరుణ, అంజన్న ఓదేలు, సతీష్, బెల్లంపల్లిలో కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎండీ చాంద్‌పాషా, ఎండీ గౌస్, టి.మణిరాంసింగ్, నీరటి రాజన్న, మహేందర్, శంకర్, గోగర్ల శంకర్, పోశమల్లు, తాండూర్‌లో సీఐటీయూ నాయకులు వేల్పుల శంకర్, మొగిలి, లచ్చన్న, వెంకటేష్, బాబు, లీలారాణి, విజయలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంటిలేషన్ మెరుగుపర్చాలి



కార్మికులతో ఐఎన్టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: గనిలోపల వెంటిలేషన్ మెరుగుపర్చాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఆర్పీ1 గనిలో బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గని మేనేజర్, ఏజెంట్‌ను కలిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ జాతీయ సమితి సభ్యులు సీహెచ్ భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జీ తిరుపతి రాజు, ఫిట్ సెక్రెటరీ వెంకటేష్, నాయకులు అనిల్, తిరుపతిరెడ్డి, రవి పాల్గొన్నారు.